TELANGANA CAPITAL

# తెలంగాణ క్యాపిటల్

నిజం.. నిజాయితీ.. నిబద్ధత

www.telanganacapitalnews.com

TELANGANA CAPITAL NEWS

హైదరాబాద్ | సంపుటి : 1 సంచిక: 85 | మంగళవారం, జూలై 23, 2024 | కంప్లిమెంటరీ కాపీ | పేజీలు : 4

బీహార్‌కు ప్రత్యేక హోదా....

## ఆ ప్రతిపాదన ఏదీ లేదన్న కేంద్రం



న్యూఢిల్లీ: బీహార్‌కు ప్రత్యేక హోదా ఇచ్చే ప్రతిపాదన ఏదీ లేదని తాజాగా కేంద్రం వెల్లడించింది. కేంద్రంలో అధికారంలో ఉన్న ఎన్డీయే కూటమిలో భాగమైన జనతాదళ్ యునైటెడ్ (జేడీయూ) బీహార్‌కు ప్రత్యేక హోదా లేదా ప్రత్యేక ఆర్థిక ప్యాకేజీ ప్రకటించాలని డిమాండ్ చేసింది. ఈ నేపథ్యం లోనే ప్రభుత్వం నుంచి స్పందన వచ్చింది. బీహార్‌తోపాటు వెనుకబడిన రాష్ట్రాలకు అభివృద్ధి , పారిశ్రామికీకరణను ప్రోత్సహించడానికి ప్రత్యేక హోదా కల్పించే ప్రణాళిక ఏదైనా ఉందా? అని జేడీయు ఎంపీ రామ్‌ప్రిత్ మండల్ కేంద్ర ఆర్థిక మంత్రిత్వశాఖను ప్రశ్నించారు. దీనికి ఆ శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌధరీ రాతపూర్వకంగా సమాధానం ఇచ్చారు. బీహార్‌కు ప్రత్యేక హోదా ఇచ్చే ప్రతిపాదన ఏదీ లేదని పార్లమెంట్ వేదికగా వెల్లడించడం గమనార్హం. లోక్‌సభ ఎన్నికల ఫలితాలు వచ్చాక ఎన్డీయే కూటమిలో జేడీయు భాగస్వామ్యం కీలకంగా మారింది. 12 మంది సభ్యుల బలంతో కూటమిలో మూడో అతిపెద్ద పార్టీగా ఉంది. ఈనేపథ్యంలో ప్రత్యేక హోదా ప్రతిపాదనను తెరపైకి తెచ్చింది. ఇది తమ పార్టీ ప్రథమ ప్రాధాన్యం అని జేడీయూ ఎంపీ సంజయ్ కుమార్ ఇటీవల వెల్లడించారు. ప్రత్యేక హోదా ఇవ్వడంలో కేంద్రానికి ఏదైన సమస్య ఉంటే తాము ప్రత్యేక ప్యాకేజీని కోరతామని తెలిపారు.

లోక్ సభలో ఆర్థిక సర్వే 2023-24ను ప్రవేశపెట్టిన

## నిర్మలా సీతారామన్



న్యూఢిల్లీ: పార్లమెంటు మాన్ సూన్ సమావేశాలు నేడు ఆరంభం అయ్యాయి. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ లోక్సభ లో ఆర్థిక సర్వే 2023-24ను, స్టాటిస్టికల్ అపెండిక్స్ తో పాటు ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా భారత్ 8 శాతం వృద్ధి రేటుతో భారత్ ప్రగతి మార్గంలో వెళుతోందన్నారు. 2047నాటకి భారత్ అభివృద్ధి చెందిన దేశం కావడానికి ఓ రోడ్ మ్యాప్ కొత్త ప్రభుత్వం ఎకనామిక్ డాక్యుమెంట్ అని నిర్మలా సీతారామన్ అన్నారు. ఆర్థికాభివృద్ధి, ద్రవ్యోల్బణాన్ని అరికట్టడం, వినియోగాన్ని పెంచే విధంగా సామాన్యుడికి ట్యాక్స్ రిలీఫ్ ఉంటుందని ప్రీబడ్జెట్ ఉంటుందని భావిస్తున్నారు.

'కన్వర్ యాత్ర' పై యూపీ, ఉత్తరాఖండ్, ఎంపీలకు...

## సుప్రీంకోర్టు నోటీసులు




న్యూఢిల్లీ: కన్వర్ యాత్ర (కావడి యాత్ర) అనేది శివ భక్తులు ఏడాదికోసారి చేసే యాత్ర. ఈ యాత్రలో 'కన్వరియాస్'(కావడులు) లేక 'భోలే' లను భుజాలపై పవిత్ర యాత్రికులు మోసుకెళుతుంటారు. హిందూ భక్తులు ఈ యాత్రను చేస్తుంటారు. దీనిని హిందీ వాళ్లు 'సావన్' (తెలుగులో అయితే 'శ్రావణ') మాసంలో చేస్తారు. ఈ ఏడాది 'సావన్' మాసం 2024 జులై 22న ప్రారంభమై ఆగస్టు 19 న ముగుస్తుంది. ఈ సావన్ యాత్రలో భక్తులు గంగ నది నీళ్లను కుండలలో నింపుకుని తమ భుజాలపై ఎత్తుకుని వందలాది మైళ్లు నడిచి స్థానిక శివుని గుడి లేక నిర్దిష్ట శివుని గుడిలో గంగా జలం అర్పిస్తారు. అంటే బాఘ్ పట్ జిల్లాలోని పురా మహదేవ్, మీరట్ లోని ఔఘర్నాథ్ , వారణాసిలోని కాశీ విశ్వనాథ్, బైద్యనాథ్ గుడులలో వాటిని అర్పిస్తారు. త్రేతా యుగంలో రావణుడి అనుచరులైన శివ భక్తులు ఇలా గంగ నది నీళ్లను కావడులలో తెచ్చి పురామహాదేవ్ ఆలయంలో అర్పించారని, తద్వారా శివుడిలోని గరళాన్ని (నెగటివ్ ఎనర్జీని) తొలగించే ప్రయత్నం చేశారని కథనం. గత వారం కన్వర్ యాత్ర వెళ్లే మార్గంలో తమ దుకాణాలకు యజమాని పేర్లు, తిను భండారాల పేర్లు ఉన్న బోర్డులు పెట్టాలని ముజఫర్ నగర్ పోలీసులు ఆదేశించారు. కాగా ఉత్తర్ ప్రదేశ్ అంతటా ఈ విధానం పాటించాలని ఆదిత్యనాథ్ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. కాగా ఇది మత విచ్ఛినానికి దారి తీస్తుందని ప్రతిపక్షాలు ఆరోపించాయి. పైగా ముస్లింలను, ఎస్సీలను వారి గుర్తింపును వెల్లడించేలా బలవంత పెడుతుందని వాదించింది. కాగా దీనిపై సుప్రీం కోర్టు సోమవారం తాత్కాలిక ఉత్తర్వు జారీ చేసింది. కన్వర్ యాత్ర వెళ్లే దారి పొడవున దుకాణదారులు తమ పేర్లను ప్రదర్శించే బోర్డును పెట్టాలన్న ఉత్తర్ ప్రదేశ్ ఉత్తర్వును లేక మార్గదర్శకాలను నిలిపివేసింది. కాకపోతే దుకాణదారులు తమ దుఖాణంలో ఏ తిండి పదార్థాలు పెడుతున్నారో బ్యానర్లలో పెట్టమంది.

విన్నపాలు వినవలె...

## హస్తినలో సీఎం రేవంత్ బిజీ బిజీ

న్యూ ఢిల్లీ: కేంద్ర బడ్జెట్ లో తెలంగాణ రాష్ట్రానికి విరివిగా నిధులు కేటాయించాలని ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టంలో ఇచ్చిన హామీలన్నింటినీ నెరవేర్చాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేంద్రాన్ని కోరారు. కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ మంగళవారం పార్లమెంటులో కేంద్ర వార్షిక బడ్జెట్ ను ప్రవేశ పెడుతున్న నేపథ్యంలో రాష్ట్రానికి రావాల్సిన నిధులు కీలక ప్రాజెక్టులు సాధించే దిశగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఢిల్లీ పర్యటన చేపట్టారు. వరుసగా కేంద్రమంత్రులతో భేటీ అయిన రేవంత్ రెడ్డి జల్ శక్తి మంత్రి సీఆర్ పాటిల్, పెట్రోలియం సహజవాయువుల శాఖ మంత్రి హరిదీప్ సింగ్ పూరీ ని కలిశారు.




పద్మశ్రీ గ్రహీతలకు రూ.25 వేల పింఛన్...

## ప్రభుత్వం జీవో జారీ



హైదరాబాద్ః కనుమరుగు అవుతున్న కళలను గుర్తించి, వాటిని భవిష్యత్తు తరాలకు అందించే కళాకారులను ప్రోత్సహించేందుకు ముఖ్యమంత్రి రేంవత్ రెడ్డి సారధ్యంలోని ప్రజా ప్రభుత్వం కృషి చేస్తుందని పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. అందులో భాగంగా ఇటీవలే పద్మశ్రీ పురస్కారాన్ని అందుకున్న గడ్డం సమ్మయ్య, దాసరి కొండప్పకు ప్రతీ నెల రూ.25 వేల ప్రత్యేక పింఛన్ మంజూరు చేస్తూ జీవో జారీ చేశామని పేర్కొన్నారు. పద్మ విభూషన్, పద్మశ్రీ పురస్కార విజేతలకు సన్మాన కార్యక్రమంలో పద్మశ్రీ గ్రహీతలకు రూ.25 వేల పింఛన్ ఇస్తామని రేవంత్ రెడ్డి ప్రకటించారని, ఇచ్చిన మాటకు కట్టుబడి ఉత్తర్వులు జారీ చేశామని చెప్పారు. భాష, సాంస్కృతిక శాఖ ద్వారా వీరికి పింఛన్ డబ్బులు నేరుగా వారి ఖతాల్లో జమ చేస్తామని జూపల్లి వివరించారు.

## ప్రధాని గొంతు నొక్కే యత్నం చేశారు - మోడీ ధ్వజం



న్యూఢిల్లీ : పార్లమెంట్ ఉన్నది పార్టీ కోసం కాదని, దేశం కోసం అని ప్రధాని నరేంద్ర మోడీ సోమవారం స్పష్టం చేశారు. ప్రతిపక్షాలపై ప్రధాని మోడీ ధ్వజమెత్తుతూ, తమ రాజకీయ వైఫల్యాలను మరుగుపరచుకోవడానికి కొన్నిపార్టీలు 'ప్రతికూల రాజకీయాలు' చేశాయని, పార్లమెంట్‌ను 'దుర్వినియోగం చేశాయి' అని మోడీ విమర్శించారు. పార్లమెంట్ సెషన్‌కు ముందు మీడియాతో ప్రధాని మోడీ మాట్లాడుతూ, మంగళవారం ప్రవేశపెట్టబోతున్న కేంద్ర బడ్జెట్ వచ్చే ఐదు సంవత్సరాల ప్రస్థానానికి మార్గాన్ని నిర్దేశిస్తుందని, 2047లో 'వికసిత్ భారత్' కల సాఫల్యానికి పునాది వేస్తుందని సూచించారు. ప్రజలు లోక్‌సభ ఎన్నికల్లో తమ తీర్పు వెలువరించారని, వచ్చే ఐదు సంవత్సరాలకు దేశం కోసం అన్ని రాజకీయ పార్టీలు ఇప్పుడు సంఘటితంగా పోరాడాలని అన్నారు. 'ఎంపిలు ఏ పార్టీవారైనా కావచ్చు, మనం ఎన్నికల పోరు సాగించిన జనవరి నుంచి మనం ఏమి చెప్పాలని అనుకున్నామో తెలియజేశామని, కొంత మంది మార్గం సూచించారని, మరికొందరు తప్పుదారి పట్టించారని, కాని ఆ కాలం ఇప్పుడు ముగిసిందని అందరికీ స్పష్టం చేయదలచుకున్నా. ప్రజలు తమ తీర్పు ఇచ్చారు' అని ఆయన తెలిపారు. 'మన సంబంధిత పార్టీల కోసం పోరాడామని, వచ్చే ఐదు సంవత్సరాలకు దేశం కోసం మనం పోరాడడం, కృషి చేయవలసి ఉండడం ఎన్నికైన అందరు ప్రతినిధులు, అన్ని రాజకీయ పార్టీల బాధ్యత' అని మోడీ నొక్కిచెప్పారు.

పార్టీలకు అతీతంగా వ్యవహరించాలని, వచ్చే నాలుగు, నాలుగున్నర సంవత్సరాలకు పార్లమెంట్ వేదికను వినియోగించుకోవాలని రాజకీయ పార్టీలకు ప్రధాని విజ్ఞప్తి చేశారు. '2029 జనవరి ఎన్నికల సంవత్సరం అయినప్పుడు మీరు ఎన్నికల క్షేత్రానికి వెళ్లవచ్చు, అందుకు పార్లమెంట్‌ను సైతం వినియోగించుకోవచ్చు. ఆ ఆరు మాసాల కోసం మీరు కోరుకున్న ఆటలు ఆడండి. కాని అప్పటి వర కు 2047 కల సాఫల్యానికి ప్రజల భాగస్వామ్యానికి ఒక ఉద్యమం నిర్మించడం ద్వారా నిరుపేదలు, రైతులు, యువజనులు, మహిళల సాధికారత కోసం కృషి చేయండి' అని మోడీ పిలుపు ఇచ్చారు. '2014 తరువాత కొందరు ఎంపిలు ఐదు సంవత్సరాలకు ఎన్నికయ్యారు, మరి కొందరు పది సంవత్సరాలకు ఎన్నికయ్యారు, కానీ పార్లమెంట్‌లో తమ నియోజకవర్గం గురించి మాట్లాడేందుకు.

దేశంలో పరీక్షల వ్యవస్థలోనే...

## పెద్ద సమస్య - రాహుల్ విమర్శ



న్యూఢిల్లీ: ప్రశ్న పత్రాల లీక్‌పై లోక్‌సభలో ప్రభుత్వాన్ని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ నాయకత్వంలో ప్రతిపక్షాలు తూర్పారబట్టాయి. దేశంలో పరీక్షల వ్యవస్థలో అత్యంత తీవ్ర సమస్య ఉందని ప్రతిపక్ష నాయకుడు రాహుల్ ఆరోపించారు. విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తనను మినహాయించి ప్రతి ఒక్కరినీ నిందిస్తున్నారని రాహుల్ విమర్శించారు. ప్రతిపక్షాల విమర్శలకు గురైన ప్రధాన్ తాను 'మా నేత ప్రధాని దయ వల్లే ఇక్కడ' ఉన్నానని, తమ ప్రభుత్వం ఉమ్మడిగా జవాబుదారీ అని స్పష్టం చేశారు. గడచిన ఏడు సంవత్సరాల్లో ప్రశ్న పత్రాలు లీక్ అయినట్లుగా ఎక్కడా దాఖలాలు లేవని కూడా మంత్రి సుస్పష్టం చేశారు. ప్రశ్న పత్రాల లీక్‌ల సమస్యపై ప్రభుత్వాన్ని ప్రతిపక్షాలు ఇరుకున పెట్టే ప్రయత్నం చేస్తుండడంతో స్పీకర్ ఓమ్ బిర్లా కల్పించుకుంటూ, అన్ని పరీక్షల గురించి ప్రశ్నలు లేవనెత్తడం సరి కాదని, మెరుగైన పరీక్ష వ్యవస్థ రూపకల్పనపై సభ్యులు చర్చించాలని సూచించారు. నీట్ ప్రవేశ పరీక్షలో అవకతవకల ఆరోపణలపై దర్యాప్తు సాగిస్తున్న సిబిఐ ఆరు ఎఫ్ఐఆర్‌లు దాఖలు చేసింది. ప్రభుత్వ, ప్రైవేట్ విద్యా సంస్థల్లో ఎంబిబిఎస్, బిడిఎస్, ఆయుష్, ఇతర సంబంధిత కోర్సుల్లో ప్రవేశాల నిమిత్తం జాతీయ పరీక్ష సంస్థ (ఎన్‌టిఎ) నీట్ యుజి నిర్వహిస్తున్నది.

ఓటుకు నోటు కేసు...

## విచారణ వాయిదా

హైదరాబాద్: తెలంగాణలో సంచలనం సృష్టించిన 'ఓటుకు నోటు కేసు' విచారణలో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసు ట్రయల్ ను హైదరాబాద్ నుంచి మధ్యప్రదేశ్ లోని భోపాల్ కు మార్చాలంటూ బిఆర్‌ఎస్ ఎమ్మెల్యే జగదీశ్ రెడ్డి సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్ పై సోమవారం జస్టిస్ బిఆర్. గవాయ్, జస్టిస్ కెవి. విశ్వనాథ్ లతో కూడిన ద్విసభ్య ధర్మాసనం విచారించింది. ఓటుకు నోటు కేసు ట్రయల్ ను భోపాల్ కు మార్చాల్సిన అవసరం ఏముందని జగదీశ్ రెడ్డి లాయర్లను బెంచ్ ప్రశ్నించింది. ఈ కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తి సిఎం అయితే కోర్టులు ఎలా ప్రభావితం అవుతాయని అడిగింది. దేశంలో ఉన్నత స్థానాల్లో ఉన్న వ్యక్తులపై కేసులు నమోదైతే వాటిని పొరుగుదేశం పాకిస్థాన్ కు మార్చాలా? అంటూ సుప్రీం ధర్మాసనం ఆగ్రహం వ్యక్తం చేసింది. దీనికి జగదీశ్ రెడ్డి లాయర్లు బదులిస్తూ.... ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తి ముఖ్యమంత్రి స్థానంలో ఉండడం వల్ల ప్రాసిక్యూట్ చేసే ఏజెన్సీలు తమ అభిప్రాయం, వాదన మార్చుకునే అవకాశం ఉందని వివరించారు. కేసులో కీలకమైన ఆధారాలను తారుమారు చేయవచ్చని, సాక్షులను ప్రభావితం చేయడానికి ప్రయత్నించే అవకాశం ఉంటుందని కోర్టు దృష్టికి తీసుకువచ్చారు. ఈ నేపథ్యంలోనే ప్రభుత్వం దాఖలు చేసిన కౌంటర్ కు రిజాయిండర్ వేసేందుకు తమకు సమయం కావాలని జగదీశ్ రెడ్డి లాయర్లు కోర్టుకు విజ్ఞప్తి చేశారు. దీనికి సానుకూలంగా స్పందించిన సుప్రీం ధర్మాసనం.. 'ఓటుకు నోటు కేసు' విచారణను రెండు వారాల పాటు వాయిదా వేసింది.

# మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్ జన్మదిన వేడుకలు





**తెలంగాణ క్యాపిటల్ న్యూస్ గన్నేరువరం:** మాజీ పార్లమెంటు సభ్యులు, తెలంగాణ మాజీ ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్ జన్మదిన వేడుకలను సోమవారం, మండల కేంద్రంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గంప వెంకన్న ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి, ఘనంగా నిర్వహించారు. అనంతరం మండల కేంద్రంలో వృద్ధులు, ప్రజలకు పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గంప వెంకన్న మాట్లాడుతూ బోయినపల్లి వినోద్ కుమార్ నిండునూరేళ్లు ఆయురారోగ్యాలతో జీవించాలని, భవిష్యత్ లో ఉన్నత పదవులు చేపట్టాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ, న్యాత స్వప్న సుధాకర్ , మాజీ ఎంపీటీసీల ఫోరమ్ అధ్యక్షుడు గుడేల్లి ఆంజనేయులు, చింతల రవి, మీసాల ప్రభాకర్, బోయిని కుమార్, గొల్లపల్లి రవి, బూర శ్రీనివాస్, ర్యాగటి వీరయ్య, బండి తిరుపతి, సాయికుమార్, శంకర్, భగవాన్ రెడ్డి, రాములు, సమ్మెట అనీల్, ఈదయ్య, తదితరులు పాల్గొన్నారు.

# బాధితులకు సత్వర న్యాయం చేయడానికి గ్రీవెన్స్ డే కార్యక్రమం

## - జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపీఎస్

**తెలంగాణ క్యాపిటల్ న్యూస్ సిరిసిల్ల:** ప్రజల వద్ద నుండి పిర్యాదులు స్వీకరించి ప్రతి పిర్యాదుపై స్పందించి బాధితులకు సత్వర న్యాయం అందించే విధంగా గ్రీవెన్స్ డే ప్రతి సోమవారం ఉదయం పది గంటల నుండి మధ్యాహ్నం మూడు గంటల వరకు జిల్లా పోలీసు కార్యాలయంలో గ్రీవెన్స్ డే కార్యక్రమం నిర్వహిస్తామని జిల్లా ఎస్పీ గారు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ బాధితులకు సత్వర న్యాయం చేయడానికి ప్రతి సోమావారం గ్రీవెన్స్ డే కార్యక్రమం నిర్వహిస్తున్నామని,అందులో భాగంగా ఈ రోజు నిర్వహించిన గ్రీవెన్స్ డే కార్యక్రమనికి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన అర్జీదారుల నుండి 18 ఫిర్యాదులు స్వీకరించి ఆయా పోలీస్ స్టేషన్ల అధికారులకు ఫోన్ చేసి బాధితుల సమస్యలను చట్టపరంగా పరిష్కరించాలని ఆదేశించామని తెలిపారు. భూ తగాదాలు,ఆస్థి తగాదాల విషయంలో చట్ట ప్రకారం, నిబంధనలకు అనుగుణంగా నడుచుకుంటూ బాధితులకు సత్వర న్యాయం అందించే విధంగా చూడాలని సూచించారు.గ్రీవెన్స్ డే ఫిర్యాదులు ఏ మేరకు పరిష్కారం అయ్యాయో ఎప్పటికప్పుడు



సమీక్షించుకుంటూ ప్రజలకు మరింత సమర్ధవంతంగా సేవలందిస్తున్నామన్నారు. ఫ్రెండ్లీ పోలీసింగ్ నిర్వహిస్తూనే అసాంఘిక శక్తులు, నేరస్థుల పట్ల కఠిన వైఖరి అవలంభిస్తూ శాంతి భద్రతల సమస్య తలెత్తకుండా చూస్తామని అన్నారు. గ్రీవెన్స్ డే ద్వారా ప్రజలు నేరుగా తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావడం ద్వారా సాధ్యమైనంత త్వరగా వాటిని పరిష్కరించేలా చూస్తామని ఎస్పీ గారు తెలిపారు.

# ప్రజావాణి దరఖాస్తులు ఎప్పటికప్పుడు పరిష్కరించాలి

## - ప్రజావాణి లో అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్

**తెలంగాణ క్యాపిటల్ న్యూస్ సిరిసిల్ల:** ప్రజావాణి దరఖాస్తులు ఎప్పటికప్పుడు పరిష్కరించాలని అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్ ఆదేశించారు. జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలోని ఆడిటోరియం లో ప్రజల నుంచి అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్ సోమవారం అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు.ప్రజావాణి కు వచ్చే దరఖాస్తులు పెండింగ్ లో పెట్టవద్దని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆదేశించారని తెలిపారు. ఆయా శాఖలకు వచ్చిన దరఖాస్తుల వివరాలను వెల్లడించారు.రెవెన్యూ శాఖకు 52, సిరిసిల్ల మున్సిపల్ కార్యాలయానికి 11, డీపీఓకు 4, ఉపాధి కల్పన కార్యాలయానికి, డీపీఆర్ఈ, ఎస్డీసీ, జిల్లా సంక్షేమ శాఖ కు మూడు చొప్పున, తంగళ్లపల్లి ఎంపీడీవో కార్యాలయానికి, ఆర్ అండ్ బీ, వ్యవసాయ శాఖకు, ఎక్సైజ్ శాఖకు, పౌర సరఫరాల శాఖ కు, విద్యాశాఖకు రెండు చొప్పున, వేములవాడ, గంభీరావుపేట, చందుర్తి, బోయినపల్లి ఎంపీడీవో కార్యాలయాలకు, ఎస్సీ అభివృద్ధి శాఖకు, సర్వే, డీసీఓ బీసీ, ఎస్పీ కార్యాలయం, డీఎంహెచ్ఓ, జడ్పీ



సీఈవో కార్యాలయాలకు ఒకటి చొప్పున దరఖాస్తులు వచ్చాయాని మొత్తం 101 అర్జీలు వచ్చినట్లు తెలిపారు. సిరిసిల్ల, వేములవాడ ఆర్డీవోలు రమేష్, రాజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా మాజీ ఎంపీ వినోద్ జన్మదిన వేడుకలు



**తెలంగాణ క్యాపిటల్ న్యూస్ బెజ్జంకి:** బెజ్జంకి మండల కేంద్రంలో స్థానిక అంబేద్కర్ చౌరస్తాలో మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్ జన్మదిన వేడుకలు బీఆర్ఎస్ మండల అధ్యక్షులు మహిపాల్ అధ్యక్షతన నిర్వహించారు. మలిదశ తెలంగాణ ఉద్యమంలో తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ అడుగుజాడల్లో నడుస్తూ,తెలంగాణ రాష్ట్ర సాధన విషయంలో 32 రాజకీయ పార్టీలను ఒప్పించటంలో కీలక పాత్ర పోషించారని, న్యాయవాదిగా,రాజకీయ నాయకుడిగా విద్యార్థి దశ నుంచే రాజకీయాల్లో నిమగ్నమై ప్రజా ఉద్యమాలు చేశారని,కరీంనగర్ ఎంపీ గా స్మార్ట్ సిటీ తీసుకువచ్చారని,రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులుగా తెలంగాణ అభివృద్ధి ,ప్రత్యేక ప్యాకేజీ కోసం పోరాడారని,భవిష్యత్ లో మరిన్ని పదవులు అధిరోహించాలని కోరుతూ కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణి చేశారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు లింగాల లక్ష్మణ్ గుండారం ఎంపీటీసీ ఎలుక దేవయ్య మండల యూత్ అధ్యక్షుడు బిగుళ్ల మోహన్ పార్టీ శ్రేణులు,పార్టీ నాయకులు , కార్యకర్తలు,అభిమానులు పాల్గొన్నారు.

# పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



**తెలంగాణ క్యాపిటల్ న్యూస్ కరీంనగర్ :** నగరంలోని భారతీయ విద్యా కేంద్రం ఉన్నత పాఠశాల 1988-89 ఎస్సెస్సీ బ్యాచ్ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం సోమవారం నగరంలో ఘనంగా నిర్వహించుకున్నారు. హొఈ సందర్భంగా హొదాదాపు మూడున్నర దశాబ్దాల అనంతరం ఒక చోట కలిసిన మిత్రులంతా ఆనందంగా గడిపారు. 35 ఏళ్ల అనంతరం కలుసుకున్న బాల్య మిత్రులంతా ఒకరికొకరు యోగక్షేమాలు, ప్రస్తుత పరిస్థితులపై తెలుసుకున్నారు. చిననాటి మధుర స్మృతులను నెమరువేసుకుంటూ ఆనందంగా గడిపారు. విద్యార్థి దశలో జరిగిన అల్లరి పనులను నెమరువేసుకున్నారు. ప్రస్తుత సమాజ పోకడలతో బిజీ బిజీగా ఉన్న జీవన గమనాలను మరిచి బాల్య మిత్రులతో కలిసి ఆటపాటలతో ఆనందంగా గడిపారు. ఈ సందర్భంగా తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను ఆహ్వానించి ఘనంగా సత్కరించుకుని, వారి ఆశీర్వాదాలు తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు మురళీధర్ రావు, మునీందర్, ప్రభాకర్, రమేష్, రామలింగారెడ్డి, కొమురయ్య, రంగాచారి, పూర్వ విద్యార్థులు కట్ట శ్రీనివాస్, రాచమల్ల శ్రీనివాస్, గంప మహేష్, కక్కిరాల సతీష్, రావుల సత్యనారాయణ, కొండా శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

# లేబర్ ఆఫీసర్‌కు సన్మానం



**తెలంగాణ క్యాపిటల్ న్యూస్ ఇల్లంతకుంట:** భవన నిర్మాణ రంగాల కార్మిక సంఘం రాజన్న సిరిసిల్ల ఆధ్వర్యంలో సోమవారం సిరిసిల్ల జిల్లా నూతన లేబర్ ఆఫీసర్ మహ్మద్ నజీర్ ను కలిసి శాలువాతో సన్మానించిన భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు పండుగ శంకర్ సన్మానించారు. ఆయన తో పాటు వివిధ మండలాల అధ్యక్షులు మరియు ఇల్లంతకుంట మండలం అధ్యక్షులడు కుమ్మరవెల్లి శ్రీనివాస్ మరియు కుంభాల రాజు మచ్చ ప్రభాకర్ మీసాల నరేష్ యాస రాజయ్య హైమదూషన్, గ్రామాల అధ్యక్షులు మరియు కార్మికులు పాల్గొన్నారు.

# ఆడిట్ అధికారికి రాజన్న ఆలయ ఉద్యోగుల సన్మానం

**తెలంగాణ క్యాపిటల్ న్యూస్ వేములవాడ:** రాజన్న ఆలయములోని లోకల్ ఫండ్ ఆడిట్ అధికారిగా విధులు నిర్వహిస్తూ హైదరాబాద్ జిహెచ్ఎంసి ఆడిట్ అధికారిగా బదిలీపై వెళ్తున్న రమేష్ ను సోమవారం రోజున రాజన్న ఆలయ ఉద్యోగుల సంఘం గౌరవ అధ్యక్షుడు సిరిగిరి శ్రీరాములు ఆధ్వర్యంలో శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ ప్రతాప్ నవీన్, పర్యవేక్షకులు వెల్ది సంతోష్, అరుణ్, మహేష్ గౌడ్, మరియు సీనియర్ అసిస్టెంట్లు నూగురి నరేందర్, నక్క తిరుపతి, పెరిక శ్రీనివాస్, ఎడ్ల సాయి , పురాణం వంశీ, పోల్సాని రాజు పాల్గొన్నారు.



# ఆర్టీసీ ఆర్ఎం నీ సన్మానించిన ప్రభాకర్ యాదవ్

**తెలంగాణ క్యాపిటల్ న్యూస్, రామడుగు:** కరీంనగర్ నుండి వయా కోరుటపల్లి మోతే గోపాల్ రావు పేట పెగడపల్లి మీదుగా జగిత్యాల వరకు ఆర్టీసీ బస్సులు పంపాలని వారం రోజుల క్రితం బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మేకల ప్రభాకర్ యాదవ్ ఆర్టీసీ డి ఏం వినతి పత్రం ఇవ్వగా ఆ రూట్లో బస్సు సౌకర్యం కల్పించడంతో సోమవారం ప్రభాకర్ యాదవ్ ఆర్టీసీ ఆర్ఎం, డి ఎం సునీత ను శాలువాతో సన్మానం చేశారు. ప్రజల కోరిక మేరకు బస్సు సౌకర్యం కల్పించినందుకు గాను ఆ గ్రామాల తరఫున ధన్యవాదాలు తెలిపారు.



# రైతు బీమా కోసం దరఖాస్తు చేసుకోండి

## - మండల వ్యవసాయ అధికారిని యాస్మిన్

**తెలంగాణ క్యాపిటల్ న్యూస్, రామడుగు:** రామడుగు మండలంలోని రైతులు గతంలో రైతు బీమా దరఖాస్తు రైతు బీమా దరఖాస్తు చేసుకొని వారు ఈ సంవత్సరం దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారిని యాస్మిన్ ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా రైతులు 18 నుండి 59 సంవత్సరాలు కలిగి ఉండాలని అలాగే భూమి పాస్ పుస్తకం, రైతు ఆధార్ కార్డు, నామిని ఆధార్ కార్డు జిరాక్స్ లు దరఖాస్తు ఫారంతో జత చేసి ఆయా రైతు వేదిక క్లస్టర్లలో వ్యవసాయ విస్తీర్ణ అధికారులకు అందజేయాలని తెలిపారు. ఇట్టి దరఖాస్తుకు ఆగస్టు 5వ తేదీ చివరి రోజు అని తెలిపారు. ఇట్టి అవకాశాన్ని రామడుగు మండల రైతాంగం సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

## సంపాదకీయం

మంగళవారం, జూలై 23, 2024

# నకిలీ ఔషధం.. నమ్మితే ప్రమాదం

భారతదేశంలో 25 శాతం మందులు నకిలీ లేదా తక్కువ నాణ్యత ఉన్నవేనని 2022లో అసోచామ్ అధ్యయనం తేల్చింది. ప్రపంచంలో అమ్ముడవుతున్న కల్తీ మందుల్లో 35 శాతం ఇండియా నుంచి ఎగుమతి అయినవేనని భారత వాణిజ్య పరిశ్రమల సమాఖ్య 2007లోనే కేంద్ర ప్రభుత్వానికి నివేదించింది. ఇటీవల తెలంగాణ రాష్ట్రంలో నకిలీ ఔషధాలు తరచూ పట్టుబడుతున్నాయి. కొన్ని స్థానికంగానే తయారు చేస్తుండగా, మరికొన్ని ఉత్తరప్రదేశ్, హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్ లాంటి రాష్ట్రాల నుంచి దిగుమతి అవుతున్నాయి. ప్రముఖ కంపెనీల పేరుతో ఎవరికీ అనుమానం రాకుండా వీటిని మెడికల్ షాపులకు చేరవేస్తున్నారు. ఎక్కువ లాభాలు వస్తుండటంతో కొంతమంది వీటిని విక్రయిస్తూ రోగుల ప్రాణాల మీదకు తెస్తున్నారు. నకిలీ ఔషధాలను చాక్ పీస్ పౌడర్, మొక్కజొన్న పిండితో కూడా తయారు చేస్తున్నట్లు ఔషధ నియంత్రణ శాఖాధికారులు గతంలో గుర్తించారు. వీటిని డాక్టర్ రెడ్డీస్, అబౌట్, సన్ ఫార్మా, గ్లెన్ మార్క్, అరిస్టో, టోరెంట్ కంపెనీల బ్రాండ్లను అతికించి విక్రయిస్తున్నట్లు నిర్ధారించారు. అంతేకాకుండా మోతాదు కంటే అతి తక్కువ రసాయనాలతో ఔషధాలు తయారు చేస్తున్నట్లు, ఒక ఫార్ములాకు బదులు మరో ఫార్ములా వాడుతున్నట్లు అధికారుల దర్యాప్తులో తేలింది. మరోవైపు ప్రభుత్వ డిస్పెన్సరీలకు సైతం నకిలీ మందులు సరఫరా చేసిన ఘటనలు గతంలో వెలుగు చూశాయి. అందుకే మనం ఒకటికి రెండు సార్లు క్రాస్ చెక్ చేసుకుని మందులను కొనకపోతే.. ఉన్న రోగం పోవడమేమో కానీ.. కొత్త రోగాలు వచ్చే ప్రమాదముంది. ఔషధాల్లో ఉండే 'యాక్టివ్ ఇంగ్రేడియెంట్' మన శరీరంలోకి చేరిన తర్వాత వ్యాధిని నియంత్రిస్తుంది. అయితే.. నకిలీ మందుల్లో యాక్టివ్ ఇంగ్రేడియెంట్ ఉండదు. పిండి, మక్కజొన్న పొడి, ఆలుగడ్డ పొడి వంటివి ఉంటాయి. కొన్ని సందర్భాల్లో తప్పుడు యాక్టివ్ ఇంగ్రేడియెంట్ వాడుతున్నారు. ఉదాహరణకు 'అమాక్సిసిల్లిన్' ట్యాబ్లెట్లలో 'పారాసిటమాల్' నింపుతున్నారు. లేదా తగినంత పరిమాణంలో యాక్టివ్ ఇంగ్రేడియెంట్ వేయడం లేదు. అంతేందుకు కేన్సర్, గుండె జబ్బుల్లో ఉపయోగించే మందుల ధరలు ఎక్కువగా ఉంటాయి. పేషెంట్లు ఏండ్ల తరబడి వీటిని వాడాల్సి ఉంటుంది. దీంతో కేటుగాళ్లు వీటికి నకిలీలను తయారు చేసి, తక్కువ ధర ఆశ చూపి పేషెంట్లకు అంటగడుతున్నారు. ఈ నకిలీ మందులు రోగి ఆరోగ్యాన్ని తీవ్ర ప్రమాదంలో పడేస్తాయి. ఇవి వ్యాధిని నయం చేయడంలో విఫలం కావడమే కాకుండా, కాలక్రమేణా రోగికి వినాశకరమైన పరిణామాలు సృష్టిస్తాయి. ఆర్థికంగానూ నష్టాన్ని చేకూరుస్తాయి. వీటిని వాడితే కొత్త అనారోగ్య సమస్యలు కూడా వచ్చే ప్రమాదం ఉంటుంది. ఈ నకిలీ ఔషధాలు అసలు మందులను పోలి ఉంటాయి. దాదాపు ఒరిజినల్ ప్రొడక్ట్ తీరుగానే ప్యాకేజ్ చేస్తున్నారు, దీనిని ల్యాబ్‌కు పంపించి టెస్ట్ చేస్తే తప్ప కొన్నిసార్లు నకిలీదని గుర్తించలేమని చెబుతున్నారు అధికారులు. అయితే మందులు కొనేముందు ప్రతి ఒక్కరూ ఒకటికి, రెండు సార్లు పరిశీలించాలి. దీర్ఘకాలిక రోగాలతో తరచూ మందులు వినియోగిస్తున్నట్లయితే గతంలో కొనుగోలు చేసిన మందులతో ప్యాకేజింగ్‌ను పోల్చుకోవాలి. పేర్లలో స్పెల్లింగ్‌ను కూడా జాగ్రత్తగా పరిశీలించాలి. తయారీ తేదీ, గడువు తేదీని తనిఖీ చేయాలి. పేరున్న కంపెనీల ఉత్పత్తులను చౌకగా అమ్ముతుంటే అనుమానించాలి. అంతేకాకుండా మెడికల్ షాపులో కొనుగోలు చేసిన మందుల బిల్లులను తప్పనిసరిగా తీసుకోవాలి. కేంద్రం ఔషధాలకు సంబంధించి 300 బ్రాండ్ మెడిసిన్‌ను నోటిఫై చేసి, వాటికి బార్, క్యూఆర్ కోడ్‌ను ఇచ్చింది. వాటిని గమనించాలి. అలాగే ఏవైనా మందులతో అనారోగ్య సమస్యలు, ఎలర్జీ, ఇతర దుష్ప్రభావాలు వంటివి కనిపిస్తే వాటిని అనుమానించాలి. వెబ్‌సైట్‌లు లేదా ఇతర ఇంటర్నెట్ ఆన్‌లైన్ ప్లాట్‌ఫారమ్‌ల నుంచి మందులు కొనుగోలు చేయకపోవడమే శ్రేయస్కరమని నిపుణులు సూచిస్తున్నారు. కొన్ని వెబ్‌సైట్లు భారీ డిస్కౌంట్లతో ఫార్మా ప్రొడక్టులను అమ్ముతుండగా.. ఇటువంటి వాటి విషయంలో జాగ్రత్తగా ఉండాలని పేర్కొంటున్నారు. వీటిని తగిన టెంపరేచర్‌లో నిల్వ చేయకపోవడం, రవాణా చేసేటప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోకపోవడంతో మందుల సామర్థ్యం తగ్గవచ్చని చెబుతున్నారు. ఆర్ఎంపీలు, డ్రగ్ కంట్రోల్ అనుమతి లేని ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్స్ ద్వారా పేషెంట్లకు నకిలీ మందులను చేరవేస్తున్నట్లు గుర్తించారు. ఇందుకోసం వాట్సాప్ గ్రూపులను సైతం వినియోగించుకుంటున్నట్లు తెలుస్తున్నది. అయితే నకిలీ ఔషధాల గురించి సమాచారం తెలిస్తే వెంటనే టోల్ ఫ్రీ నెంబర్ 1800 599 6969కు సమాచారం అందించాలి. గడువు తీరిన ఔషధాలు అమ్మినా దగ్గరలో ఉన్న డ్రగ్ ఇన్స్ పెక్టర్కు గానీ లేదా టోల్‌ఫ్రీ నెంబర్‌కైనా ఫోన్ చేసి విషయాన్ని చెప్పాలి. వీటిని తగిన టెంపరేచర్‌లో నిల్వ చేయకపోవడం, రవాణా చేసేటప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోకపోవడంతో మందుల సామర్థ్యం తగ్గవచ్చని చెబుతున్నారు. ఆర్ఎంపీలు, డ్రగ్ కంట్రోల్ అనుమతి లేని ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్స్ ద్వారా పేషెంట్లకు నకిలీ మందులను చేరవేస్తున్నట్లు గుర్తించారు.

# వారి ఒత్తిడితోనే బిల్లు తెచ్చాం

## టెకీల పని గంటల పెంపుపై మంత్రి వివరణ



న్యూఢిల్లీ: ఐటి ఉద్యోగులకు అదనపు పని గంటలు దిధించడానికి ఒక కొత్త చట్టాన్ని తీసుకురావాలని ఐటి పరిశ్రమ నుంచి ప్రభుత్వంపై ఒత్తడి ఉందని కర్నాటక కార్మిక శాఖ మంత్రి సంతోష్ లాడ్ వెల్లడించారు. అయితే ఈ అంశాన్ని ప్రభుత్వం పరిశీలిస్తోందని ఆయన తెలిపారు. రోజుకు 14 గంటల పాటు ఐటి ఉద్యోగులు పనిచేసేందుకు అనుమతిస్తూ రూపొందించిన బిల్లును ప్రభుత్వం ఇంకా పరిశీలిస్తోందని సోమవారం శాసనసభ వద్ద విలేకరులకు ఆయన తెలిపారు. ఐటి పరిశ్రమ నుంచి వచ్చిన ఒత్తిడి కారణంగానే ఈ బిల్లు రూపొందిందని ఆయన చెప్పారు. ఊటి ఉద్యోగులకు అదనపు పని గంటలు పెట్టాలన్నది ఐటి శాఖ మంత్రి ప్రియాంక ఖర్గే సొంత ఆలోచన కాదని ఆయన వివరించారు. ఐటి పరిశ్రమ నుంచి వచ్చిన ఒత్తిడి వల్లే ఈ బిల్లు రూపొందిందని, కార్మిక శాఖ దృక్కోణంలో దీన్ని పరిశీలిస్తున్నామని సంతోష్ చెప్పారు. ఈ అంశం ప్రజల ముందుకు వచ్చిన దృష్టా దీనిపై పరిశ్రమ అధిపుతలందరూ చర్చించాల్సిన అవసరం ఉందని ఆయన తెలిపారు. ప్రజలు తమ అభిప్రాయాలను స్వేచ్ఛగా వ్యక్తీకరించాలని ఆయన కోరారు. దీనిపై సబంధిత భాగస్వామ్యపక్షాలన్నీ చర్చించాలని ఆయన సూచించారు. ఐటి ఉద్యోగులలో ఈ ప్రతిపాదనపై అసమ్మతి ఉందని ఆయన తెలిపారు. ప్రజలు తమ అభిప్రాయాలను వ్యక్తం చేస్తే దాని ఆధారంగా కార్మిక శాఖ దీనిపై ఒక నిశ్చితాభిప్రాయానికి రాగలదని ఆయన చెప్పారు. ఐటి ఉద్యోగుల వ్యకిగత, సాంఘిక జీవితం గురించి ప్రశ్నించగా దీనిపై ఐటి అధిపతులు, బడా కంపెనీల నాయకులు చర్చించాల్సి ఉంటుందని ఆయన అన్నారు. ఐటి ఉద్యోగుల జీవితాలకు సంబంధించిన అంశాలపై చర్చించాల్సిన అవసరం ఐటి కంపెనీలు, వాటి యజమానులు, డైరెక్టర్లకు ఉందని ఆయన స్పష్టం చేశారు. ఐటి ఉద్యోగుల పని గంటలు పెంచాలన్న ఆలోచన ప్రభుత్వానికి కాదని, ఐటి శాఖ కాని కార్మిక శాఖ కాని దీనిపై వివేచనతో నిర్ణయం తీసుకుంటాయని ఆయన వివరించారు. కాగా..ఐటి ఉద్యోగుల పని గంటలను 14 గంటలకు పెంచాలని ప్రతిపాదిస్తూ ప్రభుత్వం ప్రవేశపెట్టనున్న బిల్లును కర్నాటక రాష్ట్ర ఐటి ఉద్యోగుల సంఘం(కెఐటియు) తీవ్రంగా వ్యతిరేకించింది. దీని వల్ల ఐటి ఉద్యోగుల మానసిక, శారీరక ఆరోగ్య, వారి ఉద్యోగ జీవిత సమతుల్యం దెబ్బతింటాయని కెఐటియు ఆందోళన వ్యక్తం చేసింది.

# టార్గెట్ హరీశ్ రావు...

**మెదక్:** కేసీఆర్ సొంత జిల్లా మెదక్‌లో రాజకీయం ఆసక్తిరేపుతోంది. వచ్చేస్థానిక ఎన్నికల నాటికి ఉమ్మడి జిల్లాలో బలమైన శక్తిగా ఎదగాలని భావిస్తోన్న కాంగ్రెస్? కారు పార్టీని ఖాళీ చేసేవిధంగా పావులు కదుపుతున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డిని హస్తం గూటికి చేర్చుకోగా, ఇప్పుడు మిగిలిన ఎమ్మెల్యేలపై వల విసురుతున్నట్లు ఊహాగానాలు వినిపిస్తున్నాయి. ఉమ్మడి మెదక్ జిల్లాల్లో మొత్తం ఏడుగురు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ఉండగా, పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి ఇప్పటికే కాంగ్రెస్ చేతిని అందుకున్నారు. ఇక మిగిలిన ఆరుగురిలో కేసీఆర్, హరీశ్‌రావు మినహా నలుగురితో హస్తం నేతలు సంప్రదింపులు జరుపుతున్నట్లు ప్రచారం జరుగుతోంది. సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ మినహా మిగిలిన ఎమ్మెల్యేలు సునీత లక్ష్మారెడ్డి, మాణిక్‌రావు, కొత్త ప్రభాకర్‌రెడ్డి ఇప్పటికే ఓ సారి సీఎం రేవంత్‌రెడ్డిని కలిశారు. అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు విడుదలైన తొలి నెలరోజుల్లోనే ఉమ్మడి మెదక్ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు సీఎంను కలవడం అప్పట్లో సంచలనమైంది. అప్పుడే వీరు పార్టీ మారనున్నారనే ప్రచారం ప్రారంభమైంది. కానీ, అప్పట్లో ఈ ప్రచారాన్ని ఖండిన నేతలు? ఇప్పుడు ఒక్కొక్కరుగా కాంగ్రెస్‌లో చేరేందుకు అడుగులు వేస్తున్నారని టాక్ వినిపిస్తోంది. సీఎం రేవంత్‌ను కలిసిన వారిలో ఇప్పటికే మహిపాల్‌రెడ్డి కాంగ్రెస్‌లో చేరగా, నెక్స్ట్ ఎవరనేది ఆసక్తి రేపుతోంది. సెప్టెంబర్, అక్టోబర్ నెలల్లో స్థానిక ఎన్నికల సమయానికి ఉమ్మడి జిల్లావ్యాప్తంగా బలపడాలనే వ్యూహంతో కాంగ్రెస్ అడుగులు వేస్తోంది. ఉమ్మడి జిల్లాల్లో కాంగ్రెస్ మూడుచోట్ల గెలిస్తే పటాన్‌చెరు ఎమ్మెల్యే చేరికతో హస్తం బలం నాలుగుకు చేరింది. ఇక చకచకా చేరికలు పూర్తిచేసి మెజార్టీ మండలాలు, మున్సిపాలిటీల్లోనూ పాగా వేయాలని ప్లాన్ చేస్తోంది కాంగ్రెస్. దీనిద్వారా క్షేత్రస్థాయిలో బీఆర్ఎస్‌ను దెబ్బతీసి మాజీ మంత్రి హరీశ్‌రావుకు జిల్లాలో చెక్ పెట్టాలని చూస్తోంది. కాంగ్రెస్ ప్రభుత్వంపై ఎప్పటికప్పుడు విరుచుకుపడే హరీశ్‌రావును మెదక్ లోనే దెబ్బతీసి? సర్కార్ పై గట్టిగా గళం విప్పకుండా నివారించాలనేది కాంగ్రెస్ ప్లాన్ గా కన్పిస్తోంది. సీఎం రేవంత్‌రెడ్డి డైరెక్షన్‌లో జిల్లా మంత్రి దామోదర రాజనర్సింహ, సీనియర్ నేత జగ్గారెడ్డి ఆపరేషన్ ఆకర్ష్‌ను వేగవంతం చేసినట్లు చెబుతున్నారు. ఒకవైపు ఎమ్మెల్యే స్థాయి నేతలను చేర్చుకుంటూనే? దిగువస్థాయిలోనూ వలసలను ప్రోత్సహించాలని కాంగ్రెస్ ప్లాన్ చేస్తున్నట్లు ఊహాగానాలు వినిపిస్తున్నాయి.

## 317 జీవోపై కేబినెట్ సబ్ కమిటీ భేటీ..

# 9 శాఖలపై చర్చ




**హైదరాబాద్ :** 317 జీవోపై రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అధ్యక్షతన కేబినెట్ సబ్ కమిటీ సమావేశం జరిగింది. సచివాలయంలో జరిగిన ఈ భేటీలో కేబినెట్ సబ్ కమిటీ సభ్యులు, మంత్రులు శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్ పాల్గొన్నారు. ఈ కేబినెట్ సబ్ కమిటీ సమావేశంలో 9 ప్రభుత్వ శాఖలపై చర్చించారు. వివిధ శాఖల అధికారులు వారి శాఖల పరంగా పూర్తి సమాచారం ఇవ్వనందున యుద్ధ ప్రాతిపదికన పూర్తి సమాచారాన్ని ఇవ్వాల్సిందిగా కమిటీ చైర్మన్ దామోదర్ రాజనర్సింహ అధికారులను ఆదేశించారు. ఈ కమిటీ సమావేశంలో పలు అంశాలను పూర్తిస్థాయిలో అధ్యయనం చేయడం జరిగింది. పాత జిల్లాల వారీగా ఉద్యోగుల సర్వీస్, ప్రమోషన్ అంశాలను పరిగణలోకి తీసుకొని 317 జీవోను పరిష్కరించాలని కేబినెట్ సబ్ కమిటీ నిర్ణయించింది. ఈ క్యాబినెట్ సబ్ కమిటీ సమావేశం లో వివిధ శాఖల ఉన్నతాధికారులు నవీన్ మిట్టల్, మహేష్ కుమార్ ఎక్కా దత్, హోంశాఖ ముఖ్య కార్యదర్శి రవి గుప్తా, పోలీస్ రిక్రూట్మెంట్ బోర్డు చైర్మన్ శ్రీనివాసరావు, అడిషనల్ డీజీ షికా గోయల్, రాష్ట్ర వైద్యారోగ్య శాఖ కార్యదర్శి శ్రీమతి క్రిస్టినా, గిరిజన సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి శరత్, సాంకేతిక విద్యా శాఖ కమిషనర్ శ్రీమతి దేవసేన, ఇంటర్మీడియట్ బోర్డ్ డైరెక్టర్ శృతి ఓజా, సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ గురుకులాల కార్యదర్శి శ్రీమతి అలుగు వర్షిని, సోషల్ వెల్ఫేర్ ముఖ్య కార్యదర్శి %చీ%. శ్రీధర్, పంచాయతీరాజ్ శాఖ కార్యదర్శి లోకేష్ కుమార్, ఆయుష్ డైరెక్టర్ ప్రశాంతి, ప్రాథమిక విద్యాశాఖ డైరెక్టర్ వెంకట నర్సింహారెడ్డి, వైద్య, ఆరోగ్యశాఖ, జిఏడి ఉన్నతాధికారులు వినయ్ కృష్ణారెడ్డి, బూసని వెంకటేశ్వరరావు తదితర వివిధ శాఖల ప్రభుత్వ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# డబ్బున్నోళ్లు విద్యా వ్యవస్థను కొనేస్తున్నారు: రాహుల్ గాంధీ



ఢిల్లీ: నీట్ పేపర్ లీకేజీ విషయంలో విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుతున్నారని కాంగ్రెస్ ఎంపి రాహుల్ గాంధీ మండిపడ్డారు. పార్లమెంట్ సమావేశాలలో నీట్ పేపర్ లీకేజీపై చర్చ సందర్భంగా రాహుల్ మాట్లాడారు. డబ్బున్నోళ్లు విద్యా వ్యవస్థను కొనేస్తున్నారని, నీట్ పేపర్ లీక్ పెద్ద సమస్యగా మారిందని, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తనను తప్ప అందరినీ తప్పుపడుతున్నారని రాహుల్ చురకలంటించారు. నీట్ పరీక్షను వెంటనే రద్దు చేయాలని డిఎంకె ఎంపి కళానిధి వీరస్వా డిమాండ్ చేశారు. నీట్ పరీక్షకు బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని కాంగ్రెస్ ఎంపి మాణిక్యం ఠాగూర్ తెలిపారు.


# లోక్‌సభ సభ్యునిగా శత్రుఘ్న సిన్హా ప్రమాణం



న్యూఢిల్లీ: టిఎంసి ఎంపి శత్రుఘ్న సిన్హా సోమవారం లోక్‌సభ సభ్యునిగా ప్రమాణం చేశారు. ఇటీవల జరిగిన లోక్‌సభ ఎన్నికలలో పశ్చిమ బెంగాల్‌లోని అసన్‌సోల్ నుంచి గెలుపొందిన సిన్హా లోక్‌సభ సభ్యునిగా ప్రమాణం చేసిన చివరి ఎంపి కావడం విశేషం. సోమవారం లోక్‌సభ సమావేశాలు ప్రారంభమైన వెంటనే శత్రుఘ్న సిన్హా పేరును సెక్రటరీ జనరల్ పిలువగా స్పీకర్ ఓం బిర్లా ఆయన చేత ప్రమాణం చేయించారు. జూన్‌లో జరిగిన లోక్‌సభ మొదటి సమావేశంలో సభ్యుడిగా సిన్హా ప్రమాణం చేయలేకపోయారు. లోక్‌సభ పూర్తి బలం 543 కాగా రెండు స్థానాల నుంచి పోటీ చేసి గెలుపొందిన కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ రాయబరేలిలో కొనసాగాలని నిర్ణయించుకుని కేరళలోని వయనాడ్ స్థానానికి రాజీనామా చేయడంతో ఆ స్థానానికి ఖాళీ ఏర్పడింది. ఒక్క స్థానం తప్ప మిగిలిన 542 స్థానాలకు చెందిన సభ్యులు ప్రమాణం చేయడం పూర్తయింది.

## అమెరికా రాజకీయాలతో మాకేం పని..

# యుద్ధ లక్ష్యాలపైనే మా దృష్టి : రష్యా



మాస్కో: అమెరికా అధ్యక్ష రేసు నుంచి ప్రస్తుత అధ్యక్షుడు బైడెన్ వైదొలగినట్టు ప్రకటించడంపై రష్యా తొలిసారిగా స్పందించింది. అమెరికా రాజకీయాలు ముఖ్యం కాదని, ఉక్రెయిన్ యుద్ధ లక్షాలను చేరుకోవడానికే ప్రాధాన్యం ఇస్తామని స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో రష్యా అధ్యక్ష భవనం క్రెమ్లిన్ అధికార ప్రతినిధి పెస్కోవ్ అక్కడి మీడియాతో మాట్లాడుతూ " అమెరికా ఎన్నికలకు ఇంకా నాలుగు నెలల సమయముంది. ఈ సుదీర్ఘ సమయంలో ఎన్నో మార్పులు జరుగుతుంటాయి. వాటి గురించి పెద్దగా ఆలోచించాల్సిన పనిలేదు. ఏం జరుగుతుందో మనం ఓపికగా పరిశీలిస్తూ ఉండాలి. అయితే రష్యా మాత్రం ఉక్రెయిన్‌పై చేస్తున్న మిలటరీ ఆపరేషన్ లక్షాలను చేరుకోవడానికే ప్రాధాన్యం ఇస్తుంది." అని తెలిపారు. తమ దేశంపై రష్యా దండయాత్రను ఉక్రెయిన్ 'యుద్ధం'గా చెబుతుండగా, రష్యా మాత్రం స్పెషల్ మిలటరీ ఆపరేషన్ అని చెప్పుకొస్తోంది. ఉక్రెయిన్‌పై రష్యా యుద్ధాన్ని అమెరికా తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. ఉక్రెయిన్‌కు భారీగా ఆయుధాలను అందిస్తోంది. ఈ నేపథ్యంలో రష్యా,అమెరికా మధ్య విభేదాలు చోటు చేసుకుంటున్నాయి. ఇదిలా ఉండగా, మళ్లీ తాను అధికారం లోకి వస్తే ఉక్రెయిన్‌కు మద్దతు ఉపసంహరిస్తానని ట్రంప్ పలుమార్లు పరోక్షంగా ప్రకటించారు. ఇలాంటి సమయంలో బైడెన్ అధ్యక్ష రేసు నుంచి వైదొలగుతున్నట్టు ప్రకటించిన కొన్ని గంటల వ్యవధి లోనే రష్యా స్పందించడం గమనార్హం. మరోవైపు బైడెన్ వైదొలగడంపై రష్యా మాజీ అధ్యక్షుడు దిమిత్రీ మెద్వదేవ్ టెలిగ్రామ్ వేదికగా స్పందించారు. ఆయన ఆరోగ్యం బాగుండాలని ఆకాంక్షించారు. రష్యా ప్రత్యేక మిలటరీ ఆపరేషన్ లక్షాలు నెరవేరబోతున్నాయని వ్యాఖ్యానించారు.

# మరో మూడు రోజులపాటు దంచి కొట్టనున్న వానలు



హైదరాబాద్: నైరుతి రుతుపవనాలు తెలుగు రాష్ట్రాలకు విస్తరించాయి. పైగా చురుగ్గా కదులుతున్నాయి. ఈ నేపథ్యంలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ లో గత వారం రోజులుగా వానలు పడుతున్నాయి. రుతుపవనాలు చురుగ్గా కదులుతున్నందున ఉత్తర కోస్తా అంతటా ఓ మోస్తరు వానలు పడనున్నాయి. దక్షిణ కోస్తాలోని పలు ప్రాంతాల్లో వర్షం కురిసే అవకాశం ఉంది. తీరంలో గాలులు గంటకు 45 నుంచి 55 కిమీ. వేగంగా వీచనున్నాయి. దాంతో సముద్రంలో అలలు ఎగిసి పడనున్నాయి. ఇప్పటికే కురిసిన వానల వల్ల గోదావరి నది ఉప్పొంగి ప్రవహిస్తున్నది. కాగా భద్రాచలం వద్ద రెండో ప్రమాద హెచ్చరికను జారీ చేశారు.

# పాలరాతి శిల్పం



కాల్విన్ క్లైయిన్ లో దుస్తులకు బ్రాండ్ అంబాసిడర్ అయిన అమ్మడు ఆ బ్రాండ్ ప్రమోషన్స్ ఏమో కానీ దిశాకు మాత్రం అదిరిపోయే రేంజ్ లో క్రేజ్ వచ్చింది. రోజుకొక ఫోటో షూట్ తో అప్పట్లో అమ్మడు చేసిన రచ్చ అంతా ఇంతా కాదు. అప్పటి నుంచి సోషల్ మీడియాలో దిశా పటాని ఫోటో కనిపిస్తే చాలు లక్షల కొద్దీ లైకులు వచ్చేస్తున్నాయి. దిశా పటాని ఏం చేసినా అదో సెన్సేషన్ అనిపించేలా ఆమె ఫోటో షూట్స్ ఉన్నాయి. తనపై ఫాలోవర్స్ పెట్టుకున్న నమ్మకాన్ని ఏమాత్రం నిరాశపరచని ఈ ముద్దుగుమ్మ లేటెస్ట్ గా మరోసారి రెచ్చిపోయింది. మోడ్రెన్ లైట్ యాష్ కలర్ డ్రెస్ లో పరువాలన్నీ కనిపించేలా దిశా అందాల విందు ఫాలోవర్స్ కు కిక్ ఎక్కిస్తున్నాయి. ఒక్కసారి చూసి చూపు తిప్పుకోలేనంత అందం ఆమెది అందుకే దిశా ఫోటోలకు సోషల్ మీడియాలో అంత డిమాండ్ ఏర్పడుతుంది. దిశా కొత్త ఫోటోలు చూసి ఈ అమ్మడు పాలరాతి బొమ్మే అంటూ క్రేజీ కామెంట్స్ పెట్టేస్తున్నారు ఆడియన్స్.

# వైట్ యానిమల్



బాలీవుడ్ లో ఎంతమంది అందగంత్తులున్నా! త్రిప్తీ డిమ్రీ తర్వాత అన్నంతగా అమ్మడు ఫేమస్ అవుతోన్న సంగతి తెలిసిందే. ఒకే ఒక్క హిట్... చిన్న రోల్ అయినా త్రిప్తిని తారా స్థాయికి తీసుకెళ్లింది యానిమల్. పాన్ ఇండియాలో అమ్మడి క్రేజ్ ఇప్పుడు మామూలుగా లేదు. ఒక్క హిట్ తో లైఫ్ టర్న్ అయిపోయింది. బాలీవుడ్ లో బిజీ నటీమణిగా మారిపోయింది. అప్పటి నుంచి నెట్టింట త్రిప్తి ఎలాంటి ఫోటో అప్ లోడ్ చేసినా హాట్ టాపిక్ గానే మారుతోంది అమ్మడు మూములాగానే ఫ్యాషన్ ఎంపికల్లో తనదైన బ్రాండ్ వేస్తుంది. అదే ఫాలోయింగ్ పీక్స్ లో ఉంటే ఇంకే రేంజ్ లో చెలరేగుతుందో చెప్పాల్సిన పనిలేదు. గత ఐదారు నెలలుగా త్రిప్తీ ఈ రకమైన యాంగిల్ లోనే నెట్టింట హాట్ టాపిక్ గా మారుతుంది. ఇన్ స్టా వేదికగా డిజైనర్ దుస్తుల్లో దూరిన ఫోటోల్ని వదులుతోంది. తనదైన మార్క్ ఎలివేషన్లతో ఆకట్టుకుంటోంది. తాజాగా అమ్మడు మరో స్టైలిస్ పిక్ తో వచ్చేసింది. ఇదిగో ఇక్కడిలా వైట్ కలర్ ఫ్రాక్ దుస్తుల్లో అమ్మడు ముస్తాబైన విధానానికి యువత ఫిదా అవుతుంది. నెక్ నుంచి వ్యాండ్స్ బాటమ్ వరకూ ఒకే డిజైన్ లో ఎంతో ఆహ్లాదంగా కనిపిస్తుంది. డ్రెస్ మ్యాచింగ్ లో దుస్తుల్లో నూ తనదైన మార్క్ ఎలివేషన్ కి ఛాన్స్ ఇచ్చింది. అమ్మడి మ్యాకప్, హెయిర్ స్టైల్, ఎంపిక చేసుకున్న యాక్సరసీస్ ప్రతీది త్రిప్తీని మరింత అందంగా హైలైట్ చేసింది.




## 'విక్రమార్కుడు' రీ రిలీజ్ డేట్ ఫిక్స్..

టాలీవుడ్‌లో రీ–రిలీజ్ ట్రెండ్‌లో మాస్ మహారాజా ఆల్ టైమ్ బ్లాక్‌బస్టర్ కూడా చేరింది. ఎస్.ఎస్.రాజమౌళి దర్శకత్వంలో 2006లో విడుదలైన 'విక్రమార్కుడు'.. సినిమాని 18 ఏళ్ల తర్వాత తిరిగి రీ రిలీజ్ చేస్తున్నారు. ఈ సినిమా ఈ నెల (జులై) 27న మరో సారి థియేటర్లలోకి సందడి చేయనుంది. ఇదే విషయాన్ని మేకర్స్ అధికారికంగా ప్రకటించారు. గతంలో బాక్సాఫీస్ వద్ద మంచి విజయాన్ని అందుకున్న సినిమాలు, కల్ట్ క్లాసిక్ సినిమాలను 4కే రిజల్యూషన్‌తో థియేటర్లలో మళ్లీ విడుదల చేస్తున్నారు నిర్మాతలు. ఈ సినిమాలను హీరోల బర్త్ డే స్పెషల్, మరేదైనా ప్రత్యేక రోజులలో రీ – రిలీజ్ చేస్తున్నారు. ఇక ఈ లిస్ట్‌లో మాస్ మహారాజా రవితేజ సినిమా కూడా చేరడంతో ఈ సినిమాని 4కె వెర్షన్‌లో థియేటర్లలో చూడాలని అభిమానులంతా ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.